చిట్టికథ

# కాయలొచ్చె... గింజలొచ్చె...

- వంగరలక్ష్మీకాంత్




నలుగురు పిల్లలు ఆడుకుంటున్నారు. అటుగా చెనక్కాయ బస్తాలతో బండి పోతుంది. పిల్లలు ఆశగా బండివంక చూడసాగారు. బస్తాకున్న బొక్కలోనుంచి ఒక కాయ కిందపడింది. బిల బిల మంటూ పిల్లలు మూగారు. వెతికి కాయను పట్టుకున్నారు. అది ఇత్తనం కాయ, ఊపి చూశాడు. మోగలా "పప్పు నిండుగా ఉంది. కదలటంలేదురా" అన్నాడు ఒకడు "ఏది నేను చెబుతా" అని లాక్కున్నాడు పక్కవాడు, కాయను కాలుకింద పెట్టి పగులగొట్టబోయాడు. "పప్పు చితికి పోతుంది" అన్నారు పిల్లలు.

చేత్తో వత్తాడు. పగల్లా, వరుసగా అందరూ వత్తారు. చెనక్కాయ మాత్రం పగల్లా. ఎవరికి వారు ఆకాయను వాళ్లే తినేయాలని తపించారు. పిల్లల ఆగం భరించలేక విత్తనం అరచే ఉంటుంది. నన్ను బాధ పెట్టవద్దని ఏడ్చేసే ఉంటుంది.

అందరూ చెనక్కాయవంక చూడసాగారు. ఒకరి తరువాత ఒకరు అరచేతిలో పెట్టుకుని క్రిందికి పైకి త్రిప్పిమరీ చూశారు. అంతలో విసురుగా గాలివచ్చి కాయని గోడకేసి కొట్టింది. గింజ తను చితికి పోతానేమోనని గుండె చిక్క బట్టుకుంది. తొక్కు పగిలి గింజ బయట పడింది. పైనుంచి క్రిందికి పడుతుంటే గుండె ఆగినంత వన య్యింది. అంతలో ఒకడి అరచేతిలో పడింది. అమ్మయ్య! దెబ్బ తగల్లేదు. బతికి పోయాను అనుకుంది. నోట్లో ఎగరేనుకో బోయాడు. గాలి మళ్లీ ఈడిసి కొట్టింది. గింజ మట్టిలో పడింది. వెతికి పట్టుకున్నారు. మట్టి తిన్నగింజకదా! మట్టెంగిలి కడగాలని చెంబుతో నీళ్లు తెచ్చి కడగబోయారు. నిజంగానే గింజని మట్టి మింగేసింది. ఎవరికీ కనపడకుండా పోయింది. రోజూవచ్చి వెతకసాగారు మూడోరోజుకల్లా మొలకొచ్చింది. ఆకులేసింది. రెమ్మలేసింది. పెద్దదయ్యి పసుపురంగు పూలు పూసింది. పూలు రాలి మొదట్లో పడ్డాయి. వేర్లు పులకించాయి. పిందె తొడిగాయి. కొన్ని రోజులకి చెట్టు ఎండి పోయింది. పిల్లలు చెట్టు పీకారు. మొదలుకు బోలెడన్నికాయలు.

గింజపోయి మొక్కా వచ్చె డాం... డాం... డాం...
మొక్కాపెరిగి పూలువచ్చే డాం... డాం... డాం...
పూలుపోయె చెట్టుపోయె డాం... డాం... డాం...
కాయలొచ్చె గింజలొచ్చె డాం...డాం.. డాం...

అంటూ పాట పాడుతూ చెనక్కాయల్ని తంపట పెట్టుకుని తిన్నారు. ★